



గతేడాది ఆగస్టులో రహదారి కోసం ముందుగా గెడ్డ వాగులో ఏర్పాటు చేసిన సిమెంట్ గొట్టాలు

జోరుగా కోడి పందేలు

- శివారు ప్రాంతాల్లో బరులు
- పండుగ మూడు రోజులు జూదం, గుండాట
- చేతులు మారిన రూ.లక్షలు
- నియంత్రించడంలో పోలీసులు విఫలం

అనకాపల్లి, పరవాడ మండలాల్లో యథేచ్ఛగా నిర్వహణ



అనకాపల్లి మండలం సీతానగరంలో కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు, జనవరి 16:
జిల్లాలోని పలు గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. శివారు ప్రాంతాల్లో నిర్వాహకులు బరులు సిద్ధం చేశారు. కోళ్లకు కత్తి కట్టి బరిలో దింపారు. పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోకుండా దర్జాగా నిర్వహించారు. ఈ పందేల్లో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. స్థానిక నేతల సహకారంతోనే కోడి పందేలు జరిగినట్టు తెలిసింది. గుండాట, జూదం జోరుగా సాగినా నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపించాయి.

యథేచ్ఛగా పోటీలు

ఈ ఏడాది సంక్రాంతి పండుగలో కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. వీటిని చూసేందుకు సంక్రాంతి అల్లుళ్లు, యువత ఆసక్తి చూపారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట, సీతానగరం, వేటజంగాలపాలెం, గోపాలపురం తదితర గ్రామాల్లో కోడి పందేలు హోరాహోరీగా జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని ఎక్కడికక్కడ పోలీసులు గస్తీ నిర్వహించినా ఆయా నిర్వాహకులు మాత్రం కోడి పందేలను దర్జాగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వాహకులు ఆయా గ్రామ శివార్లలో ఉన్న చేనుల్లో కోడి పందేలు నిర్వహించారు. అదే విధంగా కోడి పందేలు నిర్వహించిన చోటే గుండాట కూడా ఆడారు.

శివారు ప్రాంతాల్లో నిర్వహణ

అనకాపల్లి రూరల్: పరవాడ మండలంలోని మడకపాలెం, మామిడివానిపాలెం, అనకాపల్లి మండలంలోని శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, అక్కిరెడ్డివానిపాలెం, తారకరామకాలనీ, గణేష్‌నగర్ తోటల్లో కోడి పందేలు, పేకాట, గుండాటలు పండగ మూడు రోజులు యథేచ్ఛగా నిర్వహించారు. కోడిపుంజుల కాళ్లకు కత్తులు కట్టి మరీ బరిలో దింపారు. పేకాట రూపంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పరవాడ మండలం మడకపాలెంలో గుండాట నిర్వాహకుల కనికట్టుతో అమాయకుల జేబులు ఖాళీ చేశారు. కోడి పందేలు నిర్వహించే బరులన్నీ గ్రామాలకు, జనసంచారానికి దూరంగా మూడు రోజులుగా ప్రశాంతంగా పోలీసులకు ... మిగతా 8వ పేజీలో

వడ్డాదిలో ఉద్రిక్తత

- కోడి పందేల శిబిరం వద్ద చెలరేగిన వివాదం
- కోడి కత్తితో దాడి... యువకుడికి గాయం



కత్తిపోటుకు గాయపడిన తేజ

బుచ్చెయ్యపేట, జనవరి 16: కోడి పందేల శిబిరం వద్ద వడ్డాదికి చెందిన యువకుల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం కత్తిపోటుకు దారి తీసింది. సంక్రాంతి సందర్భంగా వడ్డాది- మంగళాపురం మధ్య పొలాలో కోళ్ల పందేలు నిర్వహించారు. ఈ పందేలకు వడ్డాదికి చెందిన యువకులు వెళ్లారు. అక్కడ తేజ, శ్రీరామ్ వర్గాల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఇది తీవ్రమై ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. వారిని అక్కడి వారు పంపించేశారు. బీఎన్ రోడ్డులో సాయిబాబు గుడి వద్ద మరోమారు రెండు వర్గాల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఒక వర్గంపై మరో వర్గం చాలెంజ్ చేసుకున్నారు. అక్కడ వున్న కొంత మంది వ్యక్తులు వారిని సముదాయించి పంపించేశారు. సాయంత్రం వడ్డాది వెంకటేశ్వరమహల్ వద్ద తిరిగి ఇరు వర్గాలు బాహాబాహికీ దిగాయి. తేజపై ఎ.శ్రీరామ్ కోడి కత్తితో దాడి చేయడంతో తేజ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వడ్డాదిలో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. తేజపై కత్తితో దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక చెరకు కాటా ఎదురుగా బీఎన్ రోడ్డుపై బాధితుడి వర్గానికి చెందిన యువకులు ఆందోళన చేశారు. దీంతో బీఎన్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న యువకులను అక్కడ నుంచి పంపించేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు వడ్డాది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపడిన తేజను చికిత్స నిమిత్తం చోడవరం ఆస్పత్రికి తీసుకు వెళ్లగా, అక్కడి వైద్యుల సూచన మేరకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్టర్ బరితెగింపు

వైసీపీ అండతో గెడ్డ వాగులో నుంచి దర్జాగా రహదారి నిర్మాణం

- సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రాత్రికి రాత్రే రహదారి ఏర్పాటు
- గతేడాది ఆగస్టులో పనులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- నాడు తాత్కాలికంగా పనుల నిలుపుదల
- నేడు దర్జాగా రోడ్డు నిర్మాణం
- రెవెన్యూ తీరుపై తీవ్ర విమర్శలు



ప్రధాన రహదారిని ఆనుకుని గెడ్డ వాగులో నుంచి రియల్టర్ నిర్మించిన రహదారి

పరవాడ, జనవరి 16:
అధికార పార్టీ నాయకుల అండతో ఓ రియల్టర్ బరితెగించాడు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులను సైతం లెక్క చేయకుండా రాత్రికి రాత్రే గెడ్డ వాగులోంచి 40 అడుగుల వెడల్పున రహదారిని ఏర్పాటు చేశాడు. గతంలో రెవెన్యూ అధికారులు రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. అయితే సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రియల్టర్ శనివారం రాత్రి రహదారిని దర్జాగా ఏర్పాటు చేశాడు. రెవెన్యూ అధికారులు తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎలమంచిలి - గాజువాక ప్రధాన రహదారికి ఆనుకుని పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 304లో పెద్ద గెడ్డ వాగు ఉంది. వాగు అవతల రైతుల భూములున్నాయి. ఆ భూములను పరవాడకు చెందిన ఓ రియల్టర్ ఇటీవల కొనుగోలు చేశాడు. అయితే ప్రధాన రహదారి నుంచి భూముల్లోకి వెళ్లడానికి మార్గం లేదు. కేవలం కాలిబాటే ఉంది. దీంతో ఆ రియల్టర్ గతేడాది ఆగస్టులో గెడ్డ వాగులోంచి రహదారి ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యాడు. అప్పట్లో వాగులో ఉన్న చెట్లు, తుప్పలను తొలగించి సిమెంట్ గొట్టాలు ఏర్పాటు చేశాడు. వాటి పైనుంచి రహదారిని ఏర్పాటు చేసేందుకు ఉపక్రమించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి రహదారి ఏర్పాటుకు ఆ రియల్టర్ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో శనివారం రాత్రి గుట్టు చప్పుడు కాకుండా గెడ్డ వాగు పైనుంచి 40 అడుగుల వెడల్పు మేర రహదారిని ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నోరు మెదపకపోవడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో నగదు అందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనులను అడ్డుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పుడు రహదారి ఏర్పాటు చేసినా ఎందుకు అడ్డుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారడంతోనే సంబంధిత శాఖ అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 50 సెంట్ల మేర గెడ్డను ఆక్రమించి దానిపై దర్జాగా రహదారి నిర్మించినా అడిగే నాథుడే లేకపోయాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహజ వనరులను ధ్వంసం చేసిన ఆ రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి తొలగించినట్టు నాటకం

గెడ్డ వాగుపై నిర్మించిన రహదారిని తొలంచేశామంటూ రెవెన్యూ అధికారులు కొత్త నాటకానికి తెరతీశారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కొంచెం తొలగించి పూర్తిగా తొలగించినట్టు నమ్మబలికారు. కాగా రహదారి నిర్మాణంపై తహసీల్దార్ పి.కనకారావును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఎక్స్‌కవేటర్‌కు చెందిన బ్లేడ్ రిపేరు కావడంతో పనులను నిలిపివేశామన్నారు. బుధవారం సాయంత్రానికి కల్లా రహదారిని పూర్తిస్థాయిలో తొలగిస్తామని చెప్పారు. అయితే గత ఏడాది ఆగస్టులో గెడ్డ వాగులో రహదారి ఏర్పాటు చేయడం కోసం సిమెంట్ గొట్టాలను రియల్టర్ అక్కడ సిద్ధం చేశారు. ఇప్పటికీ వాటిని తీయకుండా రహదారి ఏర్పాటు చేశారు. అప్పటి సిమెంట్ గొట్టాలు తొలగించలేని అధికారులు బుధవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో రహదారిని తొలగిస్తామని చెప్పడం కొసమెరుపు. వైసీపీకి చెందిన ఓ నాయకుడి డైరెక్షన్‌లోనే రెవెన్యూ అధికారులు నడుచుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి ఇద్దరి మృతి

ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదం

- మృతులు జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



సురేశ్ (ఫైల్)



ఎర్నాయుడు (ఫైల్)

కె.కోటపాడు, జనవరి 16:
మండలంలోని చంద్రయ్యపేట గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీలు పెడుతుండగా విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు వ్యక్తులు ఆదివారం వేకువ జామున మృతి చెందారు. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా చంద్రయ్యపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దాని కోసం సర్పంచ్ సబ్బవరపు పార్వతి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. భారీ ఫ్లెక్సీలు అమర్చుతుండగా ఫ్లెక్సీ కాస్త వంగడంతో దానిని గ్రామానికి చెందిన బోకం సురేశ్(32), గవిరెడ్డి ఎర్నాయుడు(33) సరి చేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై వారిద్దరూ కింద పడ్డారు. చికిత్స కోసం వారిని విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు ఆ కుటుంబాన్ని పరామర్శించి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి ఆర్థిక సహాయం అందించడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మృతులిద్దరూ విశాఖలో జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. సురేశ్‌కు భార్య భారతి, కుమారుడు ఉన్నారు. ఎర్నాయుడుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిలోని ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఇన్‌చార్జి ఎస్ఐ రమేశ్ తెలిపారు.

రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్ వెలవెల

- ప్రయాణికులు లేక సందడి లేని వైనం



ప్రయాణికుల సందడి లేని పీటీడీ కాంప్లెక్స్



నిర్మానుష్యంగా ఉన్న రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం

సంక్రాంతి పండగ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ప్రయాణికులతో రద్దీగా కనిపించిన అనకాపల్లి రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లు మంగళవారం బోసిపోయాయి. రైల్వే స్టేషన్, పీటీడీ కాంప్లెక్స్‌లో ఉదయం నుంచి ప్రయాణికుల సంఖ్య పెద్దగా కనిపించలేదు. సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. మంగళవారంతో సెలవులు ముగియడంతో బుధవారం నుంచి ఈ రెండు స్టేషన్లలో ప్రయాణికుల సందడి కనిపించనుంది. - అనకాపల్లి టౌన్

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



మునగపాకలో సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సంక్రాంతిని పురస్కరించుకుని మునగపాక బైపాస్ రోడ్డులో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను తిలకించేందుకు వందలాది మంది జనం తరలివచ్చారు. - వార్త 7వ పేజీలో..

పల్లెల్లో తీర్థాల సందడి

భోగి పండుగతో శ్రీకారం

- వేసవి ముగిసే వరకూ పోటా పోటీగా నిర్వహణ
- ఎన్నికల వేళ కావడంతో మరింత హుషారు



బొజ్జన్నకొండ దిగువ భాగంలో మంగళవారం తీర్థం జరుగుతున్న దృశ్యం

చోడవరం, జనవరి 16: జిల్లాలో తీర్థాల సందడి మొదలైంది. భోగి పండుగతో వీటికి శ్రీకారం చుట్టారు. ఏటా భోగి పండుగతో మొదలయ్యే ఈ తీర్థాలు జూన్ నెలాఖరు వరకు ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంటాయి.

గ్రామాల్లో కొలువైన దేవతల పేరుతో జరిగే ఈ తీర్థాలే పల్లెవాసులకు ముఖ్యమైన సంక్రాంతిగా చెప్పుకోవాలి. ఈ తీర్థాలు జరిగినన్ని రోజులూ గ్రామాల్లో ఎడ్ల పందేలు, గుర్రం పందేలు, కోడి పందేలు, సాంస్కృతిక కార్యక్రమాల జోరు సాగుతుంది. అసలే ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో గ్రామాల్లో ప్రధాన రాజకీయ పార్టీల నేతల దృష్టి అంతా ఈ తీర్థాలపై ఉండే అవకాశం ఉన్నందున, తీర్థాలు మరింత పోటాపోటీగా జరుగుతాయనడంతో సందేహం లేదు. గ్రామీణ జిల్లాలోని నూకాలమ్మ, గౌరమ్మ, మరిడమ్మ, పట్టాలమ్మ, మోదకొండమ్మ, ముత్యమాంబ, మల్లమ్మ, పరదేశమ్మ, పటమటమ్మ, చెంచమ్మ, దుర్గాలమ్మ, లక్ష్మమ్మ, పోతురాజుబాబు జాతర, పైడమ్మ, భూలోకమ్మతల్లి, తాళమ్మతల్లి, పసలమారమ్మ, పైడితలమ్మ, రాములవారి తీర్థం, ఆంజనేయస్వామి తీర్థం, టెక్కలమ్మ తల్లి, జల్దేలమ్మ తల్లి, బంగారమ్మతల్లి, త్రిమూర్తులు తల్లి, తలుపులమ్మతల్లి.. ఇలా వంద నుంచి నూట యాభైకి పైగా గ్రామ దేవతల పేరిట ఈ తీర్థాలు ప్రతి గ్రామంలోనూ జరుగుతాయి. పల్లె స్థాయికి తగినట్టుగా స్థానికులు ఈ తీర్థాలను ఘనంగా నిర్వహిస్తారు.

తీర్థాల్లో మరింత వినోదం

గ్రామీణ సంస్కృతిలో భాగమైన ఈ తీర్థాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రధానంగా ఎడ్ల పందేలు ... మిగతా 8వ పేజీలో

రాజాధిరాజుగా ఉపమాక వెంకన్న





గిరి ప్రదక్షిణోత్సవం జరుగుతున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) రాజాధిరాజు అలంకరణలో ఉపమాక వెంకన్న

ఏడాదికోసారి కనుమ పండుగ రోజు మాత్రమే రాజాధిరాజు అలంకరణలో దర్శనమిచ్చే ఉపమాక వెంకన్న దివ్యరూపాన్ని చూసి భక్తులు మంగళవారం పరవశించిపోయారు. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా వ్యాప్తంగా భక్తజనం ఉపమాక తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ గరుడాద్రి పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణోత్సవం భక్తుల గోవింద నామస్మరణతో నేత్రపర్వంగా సాగింది. - వార్త 7వ పేజీలో..



దేవరాపల్లిలో ఆకులు పట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పండుగ పూట పస్తులుంచడం తగునా?

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. జిల్లాలో పలు చోట్ల వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తుండగా, దేవరాపల్లిలో ఆకులు పట్టుకుని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. పండుగ పూట తమను పస్తులు ఉంచడం తగునా? జగనన్న అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. - దేవరాపల్లి

ఘనంగా బొజ్జన్న కొండ వద్ద బౌద్ధ మేళా

- విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ
- వైభవంగా తీర్థం

- వార్త 7వ పేజీలో..

క్రైం... crime news

కోడి పందాలపై పోలీసుల దాడులు


నాగవరంలో కోడిపందాలు ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

మునగపాక, జనవరి 16: మండలంలోని నాగవరంలో కోడి పందాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలో మామిడితోటలో కోడి పందాలు ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాలు ఆడుతున్న వారి నుంచి ఐదు వేల రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. అలాగే సోమవారం నాగులాపల్లిలో గుండాట ఆడుతున్న ఒక ఇంటిపై పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేసి, వారి నుంచి 9వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

విస్సన్నపేటలో చోరీ

» ముగ్గురు నిందితుల అరెస్టు

కశింకోట, జనవరి 16: మండలంలోని విస్సన్నపేటలో ఆదివారం రాత్రి జరిగిన చోరీలో 14.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విస్సన్నపేటకి చెందిన చెక్కా కుమారి టైలరింగ్ చేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నది. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి కూడా కుమారి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆమె గదికి గడియ వేసి ఉందని తలుపు రావడం లేదని బాధితురాలు తన కుమారుడు రమేష్‌కు సోమవారం తెల్లవారుజామున ఫోను చేసి చెప్పింది. రమేష్ ఈ విషయాన్ని ఇంటి పక్కన ఉన్న వారికి ఫోన్ చేసి చెప్పగా కుమారి గది గడియ తీశారని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేసి, అదే గ్రామానికి చెందిన షేక్ ముజెబ్, దామరౌతు నవీన్‌కుమార్, మరొక మైనర్‌ను విచారించగా నేరం అంగీకరించారన్నారు. ఈ కేసులో వీరు దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ వినోద్‌బాబు చెప్పారు.

కోడిపందాలు, పేకాట, గుండాటలపై కేసులు

పాయకరావుపేట, జనవరి 16: పాయకరావుపేట మండలంలో గడచిన రెండ్రోజులుగా పలు గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి కోడిపందాలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తున్న 30 మందిపై 12 కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.అప్పలరాజు మంగళవారం తెలిపారు. సంక్రాంతి, కనుమ రెండ్రోజులు పాల్తేరు, గుంటపల్లి, పెంటకోట, శ్రీరాంపురం, రాజవరం, కేశవరం, కందిపూడి గ్రామాల్లో సిబ్బందితో దాడులు నిర్వహించి, రూ.50 వేలు నగదు, నాలుగు కోళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు.

కోడి పందాలు, అక్రమ మద్యం తరలింపుపై దాడులు

ఎస్.రాయవరం, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన కోడి పందాల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. అలాగే మద్యం తరలిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పొన్నాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. పలు గ్రామాల్లో కోడి పందాల శిబిరాలపై దాడులు చేసి 14 మందిని అరెస్టు చేయగా, 19 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలు చోట్ల అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో 17 కేసులు నమోదు చేసి, 45 మందిని అరెస్టు చేయడంతోపాటు 21 పందెం కోళ్లను స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా 19,710 నగదును సీజ్ చేశామన్నారు.

కోడి పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు

పరవాడ, జనవరి 16 : దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీ సమీపంలోని జీడిమామిడితోటలో మంగళవారం కోడిపందాలు నిర్వహించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ ఎస్. బాలసూర్యారావు సిబ్బందితో దాడి చేసి, 2,700 నగదుతోపాటు మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

నక్కపల్లి, జనవరి 16: స్థానిక ఆస్పత్రి హైవే జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. విశాఖ నుంచి బైక్‌పై మణికంఠ, సాత్విక్‌లు యానాం వెళుతుండగా నక్కపల్లి హైవే వద్ద బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్త అల్లుడికి 300 రకాలకుపైగా

వంటకాలతో సంక్రాంతి ఆతిథ్యం


నూతన దంపతులకు వడ్డించిన పదార్థాలు

అనకాపల్లి టౌన్, జనవరి 16: తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతి. కొత్త అల్లుళ్లకు అత్తింటివారు తమ స్థోమతకు తగ్గట్టుగా మర్యాదలు చేస్తుంటారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి దుర్గాలాడ్జి వీధికి చెందిన గుండా సాయిగోపాల్, మాధవి దంపతులు సంక్రాంతిని పురస్కరించుకుని తమ అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో ఆతిథ్యం ఇచ్చారు. వందలాది రకాల స్వీట్లు, తినుబండారాలు, 15 రకాల కూరలు అరటి ఆకుపై వడ్డించారు. సాయిగోపాల్ దంపతుల కుమార్తె రిషితకు డిసెంబరులో విశాఖకు చెందిన దేవేంద్రనాథ్‌తో వివాహమైంది. పెళ్లయిన తరువాత వచ్చిన మొదటి పెద్ద పండుగ కావడంతో పాటు ఇప్పటివరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఇటువంటి సంప్రదాయాన్ని అనకాపల్లికి కూడా విస్తరింపజేయాలని ఉద్దేశంతో ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు సాయిగోపాల్ తెలిపారు.

'అమ్మఒడి' ఇస్తామని.. లక్ష మాయం!

ఎండాడ (విశాఖపట్నం), జనవరి 16: సైబర్ నేరగాళ్లు రోజుకో ఎత్తుగడతో జనాన్ని మోసం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ పథకం అమ్మఒడి పేరుతో ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి లక్ష రూపాయాలు కాజేసిన సంఘటన విశాఖపట్నంలో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్ర సచివాలయం నుంచి మాట్లాడుతున్నాం అంటూ ఓ వ్యక్తి ఇటీవల నగరంలోని ఓ వార్డు వలంటీర్‌కు ఫోన్ చేశాడు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమ్మఒడి, చేయూత, విద్యా దీవెన ఎవరెవరికి అందలేదో వివరాలు తెలుసుకున్నాడు. ఆ వివరాల మేరకు నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి, కొన్ని కారణాలతో అమ్మఒడి పథకం మీకు అందలేదని చెప్పాడు. వలంటీర్‌ను కాన్ఫరెన్స్ కాల్‌లోకి తీసుకుని అతనితో మాట్లాడించాడు. దీంతో బాధితుడికి నమ్మకం కుదిరింది. ఆ తర్వాత వలంటీర్‌ను కాన్ఫరెన్స్ కాల్ నుంచి కట్ చేసి, పథకం డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో పడుతుందని ఆ వ్యక్తిని నమ్మించాడు. ఒక లింకును బాధితుడి మొబైల్ ఫోన్‌కు పంపి... అందులో బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్ నంబరు ఎంటర్ చేస్తే డబ్బు జమ అవుతుందని చెప్పాడు. పిన్ నంబరు ఎంటర్ చేయగానే అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష లూటీ చేసేశాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసును ఛేదించిన పోలీసులు నిందితుడు కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సీరంరెడ్డి దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. అతడి కదలికలపై నిఘా పెట్టి, విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	564
విజయనగరం	568
శ్రీకాకుళం	568

నేత్రపర్వంగా మకర జ్యోతి ఉత్సవాలు

» నర్సీపట్నంలో అయ్యప్ప రథయాత్ర
» ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
» గజల్స్ శ్రీనివాస్, సినీ అర్టిస్ట్ సత్యసాయి శ్రీనివాస్‌లకు సన్మానం


గజముఖ నృత్య అకాడమీ చిన్నారులతో అయ్యన్న కుటుంబ సభ్యులు


గజల్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జనవరి 16 : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మకర జ్యోతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. సాయంత్రం రథయాత్ర చేపట్టారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్స్ శ్రీనివాస్, గాయని సుజాత పాడిన పాటలు, గజముఖ నృత్య అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్ నృత్యం ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, చింతకాలయ విజయ్ చేతుల మీదుగా గజల్స్ శ్రీనివాస్, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వి.సత్యసాయి శ్రీనివాస్, ఉమెన్ గ్రాండ్ మాస్టర్ బొడ్డా ప్రత్యూష, సినీ గాయని పెదిరెడ్ల సుజాత, యువ ఐఏఎస్ మౌర్య భరద్వాజ్ తల్లిదండ్రులు ఎంఎస్ ప్రసాద్, రాధాకుమారిలను దుశ్శాలువలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఉర్రూతలూగించింది. చివరిగా భారీఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్లు పద్మావతి, రాజేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన ప్రజలు


అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అయ్యన్న దంపతులు

రాజాధిరాజుగా ఉపమాక వెంకన్న

» కనుమ రోజు అపురూప దర్శనం » పులకించిన భక్తజనం » కోలాహలంగా స్వామి గిరి ప్రదక్షిణ

నక్కపల్లి, జనవరి 16: వెండి కిరీటంపై తలపాగా.. ఆయుధాలుగా కత్తి, డాలు.. పూల మాలలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరణ.. కాలుపై కాలువేసుకుని ఠీవిగా కూర్చుని, భక్తులకు అభయహస్తం ఇస్తూ రాజాధిరాజ అవతారంలో ఉపమాక వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ కనుమ పండుగ రోజు మాత్రమే కనబడే ఈ అపురూప దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉపమాక క్షేత్రం మంగళవారం రాత్రి వరకూ భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయింది. అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు స్వామివారిని రాజాధిరాజుగా అలంకరించారు. ఈ అవతారంలో పుణ్యకోటి వాహనంపై మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ గరుడాద్రి పర్వతం చుట్టూ గిరిప్రదక్షిణ నేత్రపర్వంగా సాగింది. భక్తులు గోవింద నామస్మరణతో గరుడాద్రి పర్వత పరిసరాలు హోరెత్తాయి. భజనలు, భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలు, భక్తుల గోవిందనామాలు, తప్పెటగుళ్లు, తోడపెద్దు కోలాటాలతో ఆద్యంతం భక్తులను పరవశింపజేశాయి. ఉపమాక గ్రామానికి చెందిన లంక వారి కుటుంబానికి చెందిన మీగడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. బాణ సంచా పేలుళ్ల ఆకట్టుకున్నాయి.


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు. ఇన్‌సెట్‌లో అరటిగెలల మొక్కులు తీరుస్తున్న భక్తులు

కరి-మకరి సంవాదం

స్వామి గిరి ప్రదక్షిణోత్సవంలో వున్న సమయంలోనే మొసలి నోట చిక్కిన ఏనుగు తనను రక్షించమని స్వామిని గట్టిగా వేడుకుంటోంది. దీంతో స్వామి గిరిప్రదక్షిణోత్సవాన్ని ముగించుకుని నేరుగా ఆపదలో వున్న ఏనుగును రక్షించడానికి సరస్సు వద్దకు వెళ్తారనేది శాస్త్ర వచనం. మంగళవారం రాత్రి కూడా బంధుర సరస్సు వద్ద వున్న లంక వారి రాతి కల్యాణ మండపంపై స్వామివారిని వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'కరి- మకర (ఏనుగు - మొసలి) సంవాదం, ఏనుగును మొసలి బారి నుంచి రక్షించడం వంటి తంతును అర్చకస్వాములు ఆలయ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు.

ఫార్మా వ్యర్థ జలాలు తాగి పాడి ఆవులు మృతి

» నష్టపరిహారం ఇప్పించాలని రైతుల వేడుకోలు


మృతి చెందిన పాడి ఆవు


మృతి చెందిన పాడి ఆవు వద్ద మహిళా రైతు

పరవాడ, జనవరి 16: ఫార్మాసిటీకి ఆనుకుని ఉన్న చినతాడిలో సోమవారం రాత్రి రెండు పాడి ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గుమ్మాలరాజు, కర్రి నూకరాజు పశువులను మేత కోసం ఫార్మాసిటీకి చెందిన పంప్‌హౌస్ పరిసర ప్రాంతాలకు తోలుకెళ్లారు. ఇటీవల కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలకు విడిచిపెడుతున్నారు. వ్యర్థాలు సమీపంలో గల గెడ్డల్లోకి కలవడం వల్ల అక్కడ నీటిని తాగిన పశువులు అనారోగ్య బారిన పడ్డాయి. రెండు రోజులుపాటు అల్లాడిపోయిన రెండు పాడి ఆవులు సోమవారం సాయంత్రం మృత్యువాత పడ్డాయి. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ ఆవులు మృతి చెందాయని బాధిత రైతులు వాపోతున్నారు. తాము వాటిపైనే ఆధారపడి బతుకుతున్నామని, అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఫార్మాసిటీ నిర్వాసిత నాయకుడు బంతికోరు గోవిందరాజు మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పాడి ఆవులు మృతి చెందాయని, తక్షణమే రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మునగపాకలో ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన


పోటీలను ప్రారంభిస్తున్న మాజీమంత్రి దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు


ఎడ్ల పరుగు పోటీలు జరుగుతున్న దృశ్యం

మునగపాక, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకుని మునగపాక బైపాస్ రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన కనిపించింది. ఈ పోటీలను చూడడానికి వేలాదిమంది రావడంతో బైపాస్ ప్రాంతమంతా కిక్కిరిసింది. పోటీలను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. అలాగే ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూండ్రపు అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

అనంతరం ప్రథమ బహుమతి సంపత్ వినాయక (నర్సాపురం), ద్వితీయ బహుమతి అద్దేపల్లి పాలవెల్లి (చుక్కపల్లి), తృతీయ బహుమతి గండి వెంకటరావు (వాయిలపాడు), నాలుగో బహుమతి అభయ ఆంజనేయస్వామి (సింహాద్రిపురం), ఐదో బహుమతి మరిడిమాంబ (బుచ్చియ్యపేట)లకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి దాడి మాట్లాడుతూ సంక్రాంతి శోభ ఈ గ్రామంలో కనవడుతుందని అన్నారు. సంప్రదాయ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.


ఘనంగా బౌద్ధ మేళా


గౌతమ బుద్ధుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ సత్యవతి, తదితరులు

తుమ్మపాల, జనవరి 16 : ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద మంగళవారం బౌద్ధ మేళా ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో బౌద్ధులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాన ద్వారం నుంచి బొజ్జన్న కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ర్యాలీని చేపట్టారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన బౌద్ధ మేళాకు ముఖ్యఅతిథిగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి హాజరై మాట్లాడారు. ప్రపంచ మానవాళికి బుద్ధుని మార్గం అనుసరణీయమన్నారు. బొజ్జన్నకొండ అభివృద్ధికి రూ.7.3 కోట్లను కేటాయించినట్టు చెప్పారు. ఈ నిధులతో ధ్యానమందిరం, మ్యూజిక్ సిస్టమ్‌తో కూడిన లేజర్ షో, తోరణం, అధునాతన టాయిలెట్లు తదితర వసతులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రముఖ బౌద్ధ భిక్షువు వెనరబుల్ డాక్టర్ ధ్యాన మహాథేరో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. బౌద్ధమతంలో గల అష్టాంగమార్గాలను ఆచరించాలని సూచించారు. అనంతరం పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల నాయకులు బల్లా నాగభూషణం, జీవీ రూప్సీలక్ష్మి, నేలపూడి బాలరాజు, గునిపూడి అరుణబాబు, బోరా లోకేశ్వరరావు, సిద్దార్థ జాన్‌బాబు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బొజ్జన్నకొండ తీర్థం

ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద మంగళవారం తీర్థం కన్నుల పండువగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తీర్థప్రియులు హాజరై ఆనందోత్సవాల మధ్య గడిపారు. ప్రధానంగా పిల్లల ఆట వస్తువులు, ఇంటి గృహోపకరణాలు, తినుబండారాలు తదితర వస్తువుల అమ్మకాలు జరిగాయి. రంగులరాట్నం, స్ప్రింగ్ జంపింగ్ తదితర ఆట వస్తువుల వద్ద పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఆనందంగా గడిపారు. అలాగే పతాంగుల పోటీలు జరిగాయి. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ జి. భవ్యారెడ్డితోపాటు పట్టణ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


బొజ్జన్నకొండపై ప్రధాన స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ ఆశయ సాధనే అందరి లక్ష్యం

» 18న ఎన్టీఆర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి
» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ఆశయాలు నెరవేరాలంటే మరోసారి చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరావు అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18న దివంగత నేత ఎన్టీఆర్ 27వ వర్ధంతిని జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సభల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు,యువకులు, భవన నిర్మాణ కూలీలు, స్కీమ్ వర్కర్లు నష్టపోయారన్నారు. రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. అంగన్‌వాడీలు సంక్రాంతి పండుగ చేసుకోకుండా తమ హక్కుల కోసం టెంట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు కొద్దిరోజులు మాత్రమే ఉన్నందున కార్యకర్తలు, నాయకులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి తెచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కేకేవీ నారాయణరావు, పార్టీ నాయకులు బి.శ్రీనివాసరావు, జగన్, గణేష్ త్రినాథ, మురళి, ప్రసన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొమిరలో సొరంగం వద్ద పహారా

» 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది
» కలెక్టర్‌కు నివేదిక సమర్పణ
» పురావస్తు అధికారుల కోసం ఎదురుచూపు


సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కాపల. ఇన్‌సెట్‌లో సొరంగం

రావికమతం, జనవరి 16 : మండలంలోని కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ కాపలా ఉంటున్నారు. ఈ గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటులో భాగంగా ఆదివారం పనులు చేపడుతుండగా సొరంగం బయట పడింది. దీంతో ఆ సర్పంచ్ గొర్లె రవికుమార్ అందించిన సమాచారం మేరకు తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. దానిని పరిశీలించి లోతుగా, లోపల వెడల్పుగా ఉండడంతో అందులోపలకు ఎవరినీ దిగనివ్వడం లేదు. సొరంగం చుట్టూ ఇనుప మెస్‌లు, కంచె, టార్పాలిన్‌లు ఏర్పాటు చేశారు. సొరంగం లోపల ప్రమాదకరమైన విషసర్పాలు ఉండవచ్చుననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ లోపలికి దిగే సాహసం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వారు హితవు పలుకుతున్నారు. పండగ సమయం కావడంతో కొమిరతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రతి ఇళ్ల బంధుగణంతో కళకళలాడుతోంది. సొరంగం చూసేందుకు ఎగబడుతుండడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గత మూడు రోజులుగా ఇక్కడ పహారా కాస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, తదపరి చర్యలకు అక్కడినుంచి వచ్చిన ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. పురావస్తు శాఖ అధికారులు వచ్చి పరిశీలన చేస్తారన్నారు.

సొరంగంలోకి వెళ్లే ప్రయత్నం చేశాను

అప్పికొండ అర్జున, యువకుడు, కొమిర



పైపులైన్ పనులు ఆదివారం మా ఇంటికి సమీపంలోనే జరుగుతున్నాయి. గ్రామ సచివాలయం దగ్గర గల ఊర మెట్ట కింద భాగంలో ఈ సొరంగం బయట పడింది. వెంటనే నేను పదిహేను నుంచి ఇరవై అడుగుల మేర లోపలికి దిగి వెళ్లారు. లోపలకు దిగే కొద్ది నున్నగా చీకటిగా ఉండి ఊపిరాడక వెనుదిరిగాను. లోపల చీకటిగా ఉండడంతో భయం అనిపించింది. మరోసారి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా సర్పంచ్ రవికుమార్ వచ్చి మందలించడంతో పైకి వచ్చేశాను.



సంతోషిమాత ఆలయం సమీపాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఏ రోడ్డు చూసినా చెత్తకుప్పలే..

దుర్వాసనతో ప్రజల ఇబ్బంది

అనకాపల్లిలో అధ్వానంగా పారిశుధ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16 : పండగ సమయాల్లో పరిశుభ్రంగా ఉండాల్సిన రహదారులు ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిచ్చాయి. శని, ఆది, సోమవారాల్లో కార్మికులు ఒక పూట పనులు చేసినా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా సెలవు కావడంతో రహదారులు చెత్తకుప్పలమయమైంది. మంగళవారం పూర్తిగా సెలవు దినం కావడంతో చెత్తకుప్పలు మరింత పెరిగి రోడ్లపై దుర్వాసన వచ్చింది. దుర్వాసన కారణంగా దోమలు స్వైరవిహారం చేశాయి. ఆలయాలు, పాఠశాలలు, వీధుల్లోకి వెళ్లే ప్రధాన మార్గాల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బంది పడ్డారు. అనకాపల్లిలో రోజుకి 80 నుంచి 90 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతుంది. ఈ మూడు రోజుల్లో 150 టన్నుల వరకు చెత్త రోడ్లపై నుంచి తొలగించి, విశాఖలోని కంపోస్టుయార్డుకు తరలించారు. దీనికితోడు మంగళవారం పూర్తిగా చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకు పోయాయి.

దూర ప్రాంతాల నుంచి అనకాపల్లికి వచ్చేవారు ఈ చెత్త కుప్పలను చూసి ఇక్కడ పారిశుధ్యం ఇంత అధ్వానంగా ఉంటుందా అని ముక్కున వేలేసుకుంటున్నారు. దీనిపై పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా.. కార్మికులకు పండగ సెలవు కారణంగా ఎవరూ రాకపోవడంతో చెత్త తొలగించలేదన్నారు. బుధవారం చెత్తకుప్పలన్నింటిని తొలగిస్తామన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు



స్క్రిప్టుకు పూజలు చేసి దర్శకుడుకు అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16 : స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయంలో మంగళవారం అమ్మవారిని ప్రముఖ చలన చిత్ర దర్శకుడు నక్కిన త్రినాథరావు, నటుడు బాలాజీ దర్శించుకున్నారు. నటుడు బాలాజీ సమర్పణలో తీయబోయే నూతన చిత్రానికి సంబంధించిన స్క్రిప్టును అమ్మవారి పాదాల వద్ద పెట్టి పూజలు చేశారు. అనంతరం టీడీపీ బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ బాలాజీ సమర్పణలో తీయబోయే ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

గ్రామాల్లో తీర్థాల జోరు



నక్కపల్లి: ఉపమాకలో తీర్థం జరుగుతున్న దృశ్యం

రాంబిల్లి, జనవరి 16 : మండలంలోని గ్రామాల్లో తీర్థాల సందడి మొదలయ్యింది. సంక్రాంతి సందర్భంగా సోమవారం లోవపాలెంలోని మత్స్యకారుల ఆరాధ్య దైవమైన పరశరామన్న స్వామివారు, దిమిలిలో సంతోషిమాతల తీర్థాలు ఘనంగా జరిగాయి. పరశరామన్నను వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దిమిలిలో సంతోషిమాతని భక్తులు దర్శించి పూజలు చేశారు. లోవపాలెం సముద్రతీరం కిటకిట లాడింది. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం కట్టుబోలులో బాలసన్యాసమ్మ, లాలంకోడూరు శివాలయం, రాంబిల్లిలో పైడితల్లి అమ్మవారుల తీర్థాలు వైభోగంగా జరిగాయి. ఆయా గ్రామాల దేవతలను భక్తులు దర్శించి పూజలు చేశారు.

నక్కపల్లిలో.. సంక్రాంతి తర్వాత గ్రామాల్లో తీర్థాల హడావిడి మొదలైంది. మంగళవారం ఉపమాక గ్రామంలో సాగిన తీర్థం జనంతో కిక్కిరిసిపోయింది. అనేక దుకాణాలు వెలిశాయి. ఇందుకోసం ఉపమాకలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. పిల్లలకు కావల్సిన అనేక ఆట వస్తువులతో పాటు, తినుబండారాలను విక్రయిస్తూ వ్యాపారులు జీవనోపాధి పొందారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని పెదరాంభద్రపురంలో మంగళవారం కోదండరామస్వామి తీర్థం ఘనంగా జరిగింది. కనుమ రోజున తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ తీర్థానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి కోదండరామస్వామిని దర్శించుకున్నారు. తీర్థంలో జెయింట్ వీల్, రైలు పిల్లలను అలరించాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పరవాడలో.. మండల కేంద్రంలో చీపురుపల్లి వారి కుటుంబీకుల ఆరాధ్య దైవం యర్రయ్యమ్మ పేరంటాలు తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం వద్దకు అధికసంఖ్యలో భక్తులు తరలివెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా సాముగరిడిలు, చిడతలు, చిటికెల భజనలు ఆకట్టుకున్నాయి.



రాంబిల్లి: లోవపాలెంలో జరుగుతున్న పరశరామన్న తీర్థం



పాయకరావుపేటరూరల్: పెదరాంభద్రపురంలో తీర్థం

19న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం

ఎలమంచిలి, జనవరి 16: స్థానిక ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని ఈనెల 19వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ అధ్యక్షుడు కొఠారు సాంబ తెలిపారు. మార్గశిర మాసం నెల రోజులుపాటు అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు, సారె ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వర్గీయ కొఠారు రాంబాబు కుటుంబీకులతో తొలిపూజ చేసిన అనంతరం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 19న రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో జరిగే తీర్థం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, భక్తులు తరలిరానున్నారన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కార్యవర్గం

ఎలమంచిలి, జనవరి 16 : పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక యేరూషలేమ్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. పాస్టర్ యేసురాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షునిగా బిషప్ డా.రెవ.కేబీకే పీటర్, ఉపాధ్యక్షునిగా రెవ.వి.డేవిడ్‌రాజు, కార్యదర్శిగా రెవ.సీహెచ్.రాజు, ఉపకార్యదర్శిగా రెవ.షాలేము రాజు, కోశాధికారిగా రెవ.జాషువారాయ్, ఉప కోశాధికారిగా ఎ.ఎజ్రా, సలహాదారులుగా రెవ.ఉదయ్‌కుమార్, చార్లెస్ పిన్ని, ప్రభుదాసు, కె.కృపరావు, ఏసురాజు, బెర్క్‌మన్, నోవహురాజు ఎన్నికయ్యారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కశింకోట: ఏఎస్‌పేటలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కోటవురట్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనిత, డీవీఎస్ రాజు, తదితరులు

కశింకోట, జనవరి 16 : మండలంలోని ఏఎస్‌పేటలో కనుమ పండుగ పురస్కరించుకొని మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగుల ముగ్గులను వేశారు. విజేతలకు వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మలసాల ధనమ్మ, మలసాల కుమార్‌రాజా పాల్గొన్నారు.

మునగపాకలో.. మండలంలోని పాటిపల్లిలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి సంక్రాంతి పురస్కారాలు అందజేశారు. మా ఊళ్లో వేసవి శిబిరం గత పదేళ్లుగా నిర్వహిస్తున్న 16మంది యువకులకు కూడా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, డాక్టర్ ఏఏ నాయుడు, రామమోహనరావు, ఆడారి త్రిమూర్తులు, మొల్లేటి సత్యనారాయణ, ధన శ్రీను పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలిలో వాడవాడలా ప్రజలు సంక్రాంతి వేడుకలను ఎంతో ఉత్సాహంతో జరుపుకున్నారు. ప్రతి ఇంటా రంగవల్లులు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని టిడ్కో గృహసముదాయం వద్ద సంక్రాంతి నాడు రంగవల్లులు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామాల్లో మంగళవారం నుంచే తీర్థాల హడావిడి ప్రారంభమైంది. కొత్తపాలెం, అగ్రహారం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన తీర్థాల్లో పెద్ద సంఖ్యలో జనాలు సందడి చేశారు. ఎలమంచిలి క్లబ్ రోడ్డు జంక్షన్‌లో సంక్రాంతి సందర్భంగా పేదలకు వర్తక సంఘం ప్రతినిధులు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొటారు వీరన్నదొర, పుల్లా వెంకటేశులు, మోటూరు వీరునాయుడు, పందిరి రాములు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మంగళవారం కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో మకర సంక్రాంతి సందర్భంగా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు ఆర్ఎస్ సీతాబాబు, విజయ్ బాబు, సర్పంచ్ అనిల్‌కుమార్ బహుమతులు అందజేశారు. రాట్నాలపాలెంలో పాండురాజు కుంతీదేవి పండుగ సందడిగా జరిగింది. మంగళవారం తప్పెటగుళ్లు, కోలాటం, సంస్కృతిక కార్యక్రమాలతో సంతబయట వరహానదిలో పాండురాజు, కుంతిదేవిలను నిమజ్జనం చేశారు. కోటవురట, సుంకపూర్, పాములవాక, కె.వెంకటాపురం గ్రామాల్లో మహిళలకు ముగ్గులు, ఆటలు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి నాడు కోటవురట్ల పాత సంతబయల తీర్థం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాజీఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, టీడీపీ మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, తదితరులు బహుమతులు అందజేశారు. సుంకపూర్‌లో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి జనసేన మండ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

పాయకరావుపేటలో.. పట్టణవాసులు సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. సోమ, మంగళవారాలు సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో జరుపుకున్నారు. పలు వీధుల్లో వేసిన రంగవల్లులు అలరించాయి. హరిదాసులు, గంగిరెద్దులవారు స్వయంపాకం అందు కున్నారు. మంగళవారం 'కనుమ'ను పురస్కరించుకుని రైతులు వ్యవసాయ పనిముట్లు, పశువులకు పూజలు చేశారు.

అచ్యుతాపురంలో.. మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రతి గ్రామంలో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి శోభ కనబడింది. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు అలరించాయి. సోమవారం సంక్రాంతి కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో ముగ్గుల పోటీలు, చిడతల భజనలు వంటి కార్యక్రమాలు జరిగాయి. కనుమ మంగళవారం పడడంతో మాంసాహారుల పంట పండింది. మంగళవారంనుంచి మాంసపు దుకాణాలు కిటకిటలాడాయి.

ఎస్.రాయవరంలో.. మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, కొత్త పోలవరం గ్రామాలకు చెందిన పేదలకు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు దుస్తులను పంపిణీ చేశారు. ఎస్. రాయవరంలో తీర్థం ఘనంగా సాగింది. పెద్ద ఎత్తున జనాలు తరలిరావడంతో తీర్థంలో జనాల సందడి అధికంగా ఉంది. వెంకటాపురంలో సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం ఆధ్వర్యంలో మహిళలు, పురుషులకు విడివిడిగా ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు.

రాంబిల్లిలో.. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో పేదలకు సాయపడాలని ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు), డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ అన్నారు. సంక్రాంతి నాడు ఎలమంచిలి మాజీ సమితి అధ్యక్షుడు స్వర్గీయ పిన్నమరాజు సత్యనారాయణరాజు, నారాయణమ్మ జ్ఞాపకార్థం రాంబిల్లిలో 1,100 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యుడు డి.నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిషోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు పాల్గొన్నారు. సంక్రాంతి సందర్భంగా హరిపురం, వాడపాలెంల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. హరిపురంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను టీడీపీ నేత ప్రగడ నాగేశ్వరరావు పరిశీలించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. వాడరాంబిల్లిలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, గ్రామానికి చెందిన పోలీస్ అధికారి జి.రమణ, సీఐటీయూ మండల కార్యదర్శి రామకృష్ణ, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



రాంబిల్లి: పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ఎస్.రాయవరం: పేదలకు దుస్తుల పంపిణీ చేస్తున్న టీడీపీ నేత వెంకటరాజు



ఎలమంచిలిలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వర్తక సంఘం ప్రతినిధులు

పండగ రోజుల్లోనూ అంగన్‌వాడీల ఆందోళన



అనకాపల్లి టౌన్: శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పాయకరావుపేటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 16 : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు 36వ రోజు మంగళవారం కూడా సమ్మెను కొనసాగించారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని నినాదాలిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పండగలో కూడా ఆందోళన చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు ఎం.రమణి, సుజాత, రమణమ్మ, రత్నం పాల్గొన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సంక్రాంతి, భోగి పండుగల్లో కూడా కొనసాగించారు. తమకు మద్దతుగా చేపట్టిన కోటి సంతకాల్లో భాగంగా ప్రజల నుంచి సంతకాల సేకరణ జోరుగా సాగిస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకూ సమ్మెను కొనసాగి స్తామని ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సంక్రాంతి పండుగ రోజుల్లో కూడా కొనసాగింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గత 36 రోజు కనుమ పండుగ నాడు తమ డిమాండ్లను గోరింటాకుతో చేతులపై రాసుకుని ప్రభుత్వానికి నిరసన తెలిపారు. యూనియన్ నేతలు నూకరత్నం, తులసి, జ్యోతి పాల్గొన్నారు.

మునగపాకలో..అంగన్‌వాడీలు మంగళవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్.. పండగ నీకు .. పస్తులు మాకా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పండగ రోజుల్లో ఎప్పుడూ ఇలా గడపలేదని, జగన్ పుణ్యమా అని మహిళలు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, హేమలత, లక్ష్మి, అంజలి, సరస్వతీ, బేబీ, పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పండగ పూట కూడా పస్తులేనా జగనన్న, ఇది మీకు న్యాయమేనా అంటూ ఖాళీ ప్లేట్లతో నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూనియన్ నేతలు సీతారత్నం, పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఎస్ రాయవరంలో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

జోరుగా కోడి పందేలు

... 5వ పేజీ తరువాయి

దొరక్కుండా యథేచ్ఛగా నిర్వహించారు.

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

కోడి పందేలు, జూదం, గుండాట నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ముందస్తుగా హెచ్చరించినా నిర్వాహకులు ఖాతరు చేయలేదు. పోలీస్ సిబ్బంది మఫ్టీలో తిరుగుతూ పర్యవేక్షిస్తారని చెప్పినా ఏ మాత్రం భయం లేకుండా దర్జాగా కోడి పందేలు, గుండాట నిర్వహించారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ పందేలు నిర్వహించడం పోలీసులకు సవాల్ విసిరినట్టయింది.



పరవాడ మండలం మడకపాలెం తోటల్లో తలపడుతున్న పందెం పుంజులు

పల్లెల్లో తీర్థాల సందడి

... 5వ పేజీ తరువాయి

కోడి పందేలు, గుర్రం పందేలు, వీటితో పాటు యువతను ఆకట్టుకునే రికార్డింగ్ డ్యాన్సులు, లిల్లీ డ్యాన్సులు, గుల్లాట, బల్లాటలు తప్పనిసరి. అలాగే తీర్థం స్థాయిని బట్టి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు కూడా నిర్వహించడం ఆనవాయితీ. ఇక చిన్నారులకు రంగులరాట్నాలు, ఆటబొమ్మలు, బెలూన్లు, బొమ్మలు, పంచదార చిలుకలు, నెయ్యి చక్కీలు, కర్జూరం తప్పనిసరిగా దొరుకుతాయి. మహిళలకు అలంకరణ సామగ్రి, ప్లాస్టిక్, ఇతర గృహోపకరణాల సామగ్రితో దుకాణాలు కళకళలాడతాయి. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేలా తీర్థాల సందడి ఆరు నెలల పాటు జరగనున్నది.

రామలింగస్వామి పురస్కారాలు ప్రదానం



విల్లూరి భార్గవ్ దంపతులను సత్కరించిన యార్లగడ్డ

అనకాపల్లి టౌన్, జనవరి 16 : స్థానిక ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార వేడుకలు జరిగాయి. పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా వివిధ రంగాల్లో సేవలందించిన చిలకూరి శ్రీనివాసరావు, మార్గం రాజేష్, పి.తిరుపతిరావు పట్నాయక్, రాపర్తి జగదీష్‌కుమార్, ఎస్.రవితేజ, విల్లూరి భార్గవ్, జీరెడ్డి తరుణ్‌కుమార్‌లకు పురస్కారాలను అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, కె. శివశంకర్‌బాబు, డాక్టర్ కె. వీరభద్రరావు, కాండ్రేగుల వెంకటరమణ, విల్లూరి పైడారావు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మకరజ్యోతి వేడుకలు



పడి వెలుగుతున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16 : పట్టణంలోని గవరపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి మకరజ్యోతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి ఆభరణాలను పురవీధుల్లో ఊరేగించారు. వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ మకరజ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. బంగారు ఆభరణాలతో అలంకరించిన అయ్యప్పస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల అయ్యప్ప శరణ గోషతో హోరెత్తింది. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, అయ్యప్ప ఆలయ కన్వీనర్ మళ్ల సూర్యప్రకాష్, కో-కన్వీనర్ మద్దాల నారాయణరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ నాని, భీశెట్టి నూకేష్ పాల్గొన్నారు. అలాగే మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

చినయాతపాలెంలో ఘనంగా గోపూజ

సబ్బవరం, జనవరి 16 : మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలో టీటీడీ ఆధ్వర్యంలో గో పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కనుమ పండగను పురస్కరించుకొని వీరాంజనేయస్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, మల్ల బాలాజీ ఆధ్వర్యంలో బుద్ధ నరసింహారావు పర్యవేక్షణలో గ్రామస్థులు గోమాతకు పూజలు చేశారు. అంతకు ముందు గోమాతను ఊరేగించారు. కార్యక్రమంలో మళ్లి కోటేశ్వరరావు, రాము, గంగునాయుడు, నాగభూషణం పాల్గొన్నారు.

మంచు ముసుగులో ఎలమంచిలి



మంచు ముసుగులో ఉన్న రైల్వే స్టేషన్ రోడ్డు

ఎలమంచిలి, జనవరి 16: ఎలమంచిలి పట్టణాన్ని మంగళవారం ఉదయం మంచు కమ్మేయడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వరుసగా మూడు రోజుల నుంచి కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 8 గంటలు కావస్తున్నా సరే మంచు ముసుగు తొలగకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సత్యవతి



మునగపాక, జనవరి 16 : మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా వెలగా వెంకట సత్యవతి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు ఆమె తెలిపారు. ఈమె మునగపాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టెక్కలి వెంకటరావు కుమార్తె. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

బయ్యవరంలో జైశ్రీరామ్ జెండాలు పంపిణీ

ఎలమంచిలి, జనవరి 16: అయోధ్య శ్రీరాముని ఆలయ ప్రారంభం సందర్భంగా బయ్యవరంలో ఇంటింటికి జై శ్రీరామ్ జెండాలను స్థానిక పట్టాలమ్మతల్లి యూత్ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరావు, నాయకులు గంజి రాము, ఆర్.శ్రీనివాసరావు, కె.భీమ్మ, శ్రీను, లోవరాజు పాల్గొన్నారు.

ఎదురులేని మనిషి ఆడియో విడుదల రేపు



పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, జనవరి 16 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18వ తేదీన ఎదురులేని మనిషి ఆడియో ఆవిష్కరించనున్నట్టు తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంతబయలులోని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసంలో వీరభద్రరావుచే మంగళవారం ఎదురులేని మనిషి ఆడియో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీరామారావు ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో తెలుగుశక్తి నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి మద్దతివ్వండి

నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, దూళి రంగనాయకులు

రాంబిల్లి, జనవరి 16 : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి కుటుంబం తమ మద్దతు తెలపాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు అన్నారు. సోమవారం హరిపురంలో టీడీపీ సంక్రాంతి సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, గ్రామఅధ్యక్షులు డి.అప్పారావు, తెలుగుయువత మండల ఉపాధ్యక్షులు కోన అప్పలనాయుడు, నాయకులు యాండ్ర అప్పలనాయుడు, ఎన్.నరసింగరావు, నూకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన



గొలుగొండలో మోకాళ్లపై నిలిచి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గొలుగొండ, జనవరి 16 : పండగను సైతం పట్టించుకోకుండా డిమాండ్లపై అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఇక్కడ ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు మంగతాయారు, ఆర్.వెంకటలక్ష్మి, నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లలపాలెంలో గొర్రెలు, మేకలకు పెళ్లి



గొల్లలపాలెంలో గొర్రెకు, మేకకు వివాహం జరపుతున్న పెద్దలు

రావికమతం, జనవరి 16 : పూర్వీకుల నాటినుంచి వస్తున్న సాంప్రదాయాన్ని మండలంలోని గొల్లలపాలెంలో యాదవులంతా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కనుమ పండగను పురస్కరించుకుని గొర్రెలకు, మేకలకు పెళ్లిళ్లు జరిపారు. గ్రామానికి చెందిన చంద్రాన దేముడు, మురుకుటి దేముళ్ళు, ముత్యా అర్జున, సూర్యనారాయణ తదితర కుటుంబ సభ్యులు ఉదయాన్నేలేచి, అభ్యంగన స్నాన మాచరించి గొర్రెలు, మేకల వివాహనికి ఏర్పాట్లు చేపట్టారు. పసుపు, కుంకుమ, అక్షింతలు, మంగళ సూత్రాలు తదితర సామగ్రితో గొర్రెల మందలున్న చోటకు వెళ్లారు. ఆ మందలో నుంచి గొర్రె, మేక పోతు, ఆడ గొర్రె, మేకకు స్నానాలు చేయిచి పసుపు కుంకమలతో అలకరించి గ్రామ పెద్దలచే ఆడ గొర్రె మెడలో మంగళ సూత్రం కట్టించారు. ఇలా పెళ్లి తంతును సందడిగా చేశారు. ఈ కార్యక్రమంలో మరుపాక ఎంపీటీసీ సభ్యుడు ముత్యా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము,ధూళితో గన్నవరంమెట్ట వాసుల అవస్థలు



గన్నవరంమెట్ట వద్ద ఉన్న స్టోన్ క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము,ధూళి

నాతవరం, జనవరి 16 : అదో పల్లె.. కాస్త దూరం నుంచి ఆ గ్రామాన్ని చూసేవారికి మంచు ఆవహించి ఉన్నట్టు కనిపిస్తుంది. అదే జరిగితే ప్రకృతి ప్రేమికులకు కనువిందే.. కానీ అక్కడ జరుగుతున్నది వేరు.. ఆ ఊరి వద్ద ఉన్న ఓ స్టోన్ క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి ఇటువంటి వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఈ సమస్యతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నాం మహాప్రభో.. అని ఆ గ్రామస్థులు వేడుకుంటున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా చేసేది లేక రోగాలొస్తే ఆస్పత్రులకు పరుగులు తీయడం వారికి నిత్యతంతుగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. నాతవరం మండలం గన్నవరంమెట్ట వద్ద ఓ స్టోన్‌క్రషర్ ఉంది. దీని నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో ఆ సమీపంలో ఇళ్లలో ఉన్నవారు సుమారు ఎనిమిది వందల మంది వరకు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి ఈ వాతావరణం కారణంగా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అంతా భయాందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, గ్రామస్థులు తాము ఉతికిన బట్టలను ఉదయాన్నే ఆరుబయట ఆరవేస్తే సాయంత్రానికి వాటిపై దుమ్ము ధూళి పడడంతో పాటు దుర్వాసన వస్తున్నట్టు చెపుతున్నారు. అలాగే ఈ స్టోన్‌క్రషర్ పక్కనే ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు. గురు, శుక్రవారాల్లో వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కాలుష్యం కారణంగా వీరికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. స్టోన్‌క్రషర్ దగ్గరలో ఉన్న చెట్లను ఒక్కసారి పరిశీలిస్తే తాము ఎదుర్కొంటున్న సమస్య ఏమిటో అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్థమవుతుందని అక్కడివారంతా విలపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తమను ఈ సమస్యను కాపాడాలని వేడుకుంటున్నారు.

పల్లెల్లో తీర్థాల సందడి

... 5వ పేజీ తరువాయి

కోడి పందేలు, గుర్రం పందేలు, వీటితో పాటు యువతను ఆకట్టుకునే రికార్డింగ్ డ్యాన్సులు, లిల్లీ డ్యాన్సులు, గుళ్లాట, బళ్లాటలు తప్పనిసరి. అలాగే తీర్థం స్థాయిని బట్టి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు కూడా నిర్వహించడం ఆనవాయితీ. ఇక చిన్నారులకు రంగులరాట్నాలు, ఆటబొమ్మలు, బెలూన్లు, బొమ్మలు, పంచదార చిలుకలు, నెయ్యి చక్కీలు, కర్జూరం తప్పనిసరిగా దొరుకుతాయి. మహిళలకు అలంకరణ సామగ్రి, ప్లాస్టిక్, ఇతర గృహోపకరణాల సామగ్రితో దుకాణాలు కళకళలాడతాయి. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేలా తీర్థాల సందడి ఆరు నెలల పాటు జరగనున్నది.

జోరుగా కోడి పందేలు



కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం

... 5వ పేజీ తరువాయి

దొరక్కుండా యథేచ్ఛగా నిర్వహించారు.

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు



గుళ్లాట ఆడుతున్న దృశ్యం

కోడి పందేలు, జూదం, గుండాట నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ముందస్తుగా హెచ్చరించినా నిర్వాహకులు ఖాతరు చేయలేదు. పోలీస్ సిబ్బంది మఫ్టీలో తిరుగుతూ పర్యవేక్షిస్తారని చెప్పినా ఏ మాత్రం భయం లేకుండా దర్జాగా కోడి పందేలు, గుండాట నిర్వహించారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ పందేలు నిర్వహించడం పోలీసులకు సవాల్ విసిరినట్టయింది.



బుచ్చెయ్యపేట : బంగారుమెట్టలో పోటీలను పర్యవేక్షిస్తున్న తాతయ్యబాబు



బుచ్చెయ్యపేటలో ఎడ్ల పరుగు పోటీ దృశ్యం



గొలుగొండ మండలం పుత్తడిగైరంపేటలో...

ఊరూరా.. సంక్రాంతి సంబరం

- ఓవైపు ముగ్గుల పోటీలు
- మరో వైపు ఎడ్ల పరుగు పందెలు
- ఎటు చూసినా జనసందోహమే..



మాడుగులలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

బుచ్చెయ్యపేట, జనవరి 16 : సంక్రాంతి పం డగ సందర్భంగా టీడీపీ, జనసేన అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మండలంలోని బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, కొం డెంపూడిలలో టీడీపీ మెనిఫెస్టో సూపర్ సిక్స్ ముగ్గుల పోటీలను టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ప్రారంభించి ప్రసంగించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల జీవితాలు బాగుపడతాయన్నారు. జగన్ అసమర్థ పాలన వలన రాష్ట్రప్రజలు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. అంగన్‌వాడీలు 36 రోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకపోవడం దారు ణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు జెర్రి పోతుల నానాజీ, టీడీపీ నాయకులు ఎస్. శ్రీరామూర్తి, సాయం శేషు, దొండా శ్రీను, వెంకటరమణ, తాళ్లవలస మహేష్, కొప్పు శ్రీను, ఎలిశెట్టి గణేశ్, సయ్యపురెడ్డి జగదీష్, సత్తిబాబు, దొండా నరేష్ తదితరులు పాల్గొన్నారు. బంగారుమెట్టలో సోమవారం అచ్చెంపేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. వడ్డాది, బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం, పోతనపూడి అగ్రహారం, ఎల్.సింగవరం, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, చినఅప్పన్నపాలెం, పొట్టిదొరపాలెం, కొండెంపూడి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఎడ్ల, పరుగు పందాలు అలరించాయి. మొత్తం పది జతల ఎడ్లు పాల్గొనగా, మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వేపాడ హర్షవర్ధన నాయుడు (దండి సురవరం), పేరపు నూకరాజు (చుక్కపల్లి), పిల్లా మోహన్‌కుమార్ (మంగళాపురం), పాచిల శ్రీను (ఎం.కోటపాడు) ఎడ్లు నిలిచాయి. విజేతలకు టీడీపీ చోడవరం నియోజకవర ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సాయం రమేష్, బైన మణికంఠ, దొండా శ్రీను తదితరులు నగదు పురస్కారాలను అందజేశారు.



రావికమతం : గంపవానిపాలెంలో సారె ఊరేగింపు

రావికమతం : కనుమ పండగ సందర్భంగా రావికమతంలో మంగళవారం పసిబిడ్డల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. రాంబయ్యమ్మ తీర్థంగా చెప్పుకునే ఈ ఉత్సవానికి వారం రోజుల పసికందును సైతం తీసుకు వస్తారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బిడ్డలను చూపించి సుఖసంతోషాలతో వర్థిల్లేలా బొట్టుపెట్టి తీసుకువెళ్తారు. ఈ సంబరానికి పెద్ద ఎత్తున తల్లులు బిడ్డలతో తరలి వస్తుంటారు. అలాగే చినపాచిలలో కనుమ పండగ సందర్భంగా దేవుని తీర్థం ఆనందోత్సాహల నడుమ నిర్వహించారు. అలాగే, గంపవానిపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సారెను ఊరేగించారు. గొంపలో కూడ కొండపైనున్న భీమలింగేశ్వరస్వామి తీర్థాన్ని ఘనంగా జరిపారు. రావికమతం కంచిపాటి వారి రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు కంచిపాటి జగన్నాథరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

గొలుగొండ: మండలంలో గ్రామ గ్రామాన సంక్రాంతి పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా సాలికమల్లవరం, జోగంపేట, గొలుగొండ, పాకలపాడు, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, పుత్తడిగైరంపేట గ్రామాల్లో తీర్థ మహోత్సవాలను నిర్వహించారు. చెట్టు భజనలు, తోడపెద్దుల భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కృష్ణాదేవిపేట : ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం తదితర గ్రామాల్లో సంకాంత్రి, కనుమ పండగలను పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది వరకు హాజరై అందమైన ముగ్గులను వేశారు. విజేతలకు ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, సర్పంచులు పందిరి సత్యంనాయుడు, యలమంచిలి రఘురామ్, సంతోష్, జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర తదితరులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలకు చెందిన



నాగాపురంలో బహుమతిని గెలుపొందిన ముగ్గు

నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని గ్రామ గ్రామాన సంక్రాంతి పండగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు చామంతిపురంలో సోమవారం రాత్రి ముగ్గులు పోటీలతో పాటు చిడతల డ్యాన్సు నిర్వహించారు. విజేతలను సర్పంచ్ బోద్దు గోవిందరావు బహుతులు అందజేశారు. తామరంలో టీడీపీ సీనియర్ నాయకుడు కోసూరు శ్రీను అధ్వర్యంలో ముగ్గులు పోటీలతో పాటు డ్యాన్సు కార్యక్రమాలు నిర్వహించారు. పీపీ అగ్రహారం రామాలయం వద్ద ముగ్గుల పోటీలు జరిపి బహుమతులు అందజేశారు.

మాడుగుల రూరల్ : సంక్రాంతి పండగను ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు. భోగిమంట, సంక్రాంతి ముగ్గులు, సాంప్రదాయ వస్త్ర ధారణతో గ్రామాల్లో సందడి నెలకొంది. యువకులు భోగిమంటలు వేయగా చిన్నారులు పిడకల దండలు మంటల్లో వేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో యువతి, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రోలుగుంట : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా రత్నంపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలను నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. సోమవారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన ముగింపు ఉత్సవాల్లో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. జనసేన నాయకులు బత్తిన సన్యాసిరావు, సోమాలనాయుడు, ప్రసాద్, విశారపు సాయి గిరి, మండల పార్టీ అధ్యక్షుడు బలిజి మహారాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి అప్పలమ్మ తీర్థం మంగళవారం దేవరాపల్లిలో ఘనంగా జరిగింది. మాజీ ఎంపీపీ కిపర్తి భాస్కరరావు, వి.సింహాచలంనాయుడు, లలితా ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నృసింహ గజపతినగరంలో బుధవారం నారితల్లమ్మ పేరంటాలు తీర్థం జరిగింది. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలు ప్రారంభమయ్యాయి.

చీడికాడ : శిరిజాం శివారు ఎస్ఎన్‌పురం కాలనీలో మంగళవారం జరిగిన ఎడ్లపరుగు పందెంలో అపశృతి చోటుచేసుకుంది. పైడితల్లమ్మ తీర్థాన్ని పురస్కరించుకొని ఏర్పాటైన ఎడ్ల పరుగు పోటీలను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. ఇందులో భాగంగా గ్రౌండ్‌లో పరుగుతీస్తున్న ఎడ్లబండి జనంలోకి దూసుకు వచ్చింది. దీంతో అక్కడి జనం ఒక్కసారిగా పరుగులు తీశారు. పెదగోగాడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు బొడ్డు దేముడునాయుడు కింద పడిపోయాడు. దీంతో పోలీసులు అతనిని లేపి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలావుంటే, ఈ పోటీల్లో మాడుగుల మండలం కెజె.పురం గ్రామానికి చెందిన కోయిలాడ మోహన్ ఎద్దులకు ప్రథమ, నాల్గవ స్థానాలు దక్కాయి.



వీరభద్రునిపేటలో ముగ్గుల పోటీ విజేతకు పైలా ప్రసాద్ బహుమతి ప్రదానం



చీడికాడ మండలం ఎస్ఎన్‌పురంలో ఎడ్ల పరుగు పందెం



రోలుగుంట : రత్నంపేటలో బహుమతిని అందిస్తున్న జనసేన నేత రాజు

వాలీబాల్, క్రికెట్ విజేతలకు బహుమతులు

నాతవరం, జనవరి 16 : మండల కేంద్రం నాతవరంలో గత పదిహేను రోజుల నుంచి నిర్వహిస్తున్న వాలీబాల్, క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. కేఎస్ఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో నర్సీపట్నం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, వీరికి నిర్వాహకులు రూ.15వేల నగదుతో పాటు షీల్డును అందజేశారు. ద్వితీయస్థానంలో కశిమి జట్టు నిలవగా పైల పోతురాజు దంపతులు రూ.10వేల నగదు, షీల్డు అందజేశారు. అలాగే క్రికెట్‌లో ప్రథమస్థానం వచ్చిన నాతవరం టీమ్‌కు రూ.15 వేలు, షీల్డును పైల వెంకు నాయుడు అందజేశారు, ద్వీతీయస్థానం జోగంపేటకు రాగా 10వేలు నగదును కామిరెడ్డి సత్యనారాయణ కుటుంబ సభ్యులు అందజేశారు. మేన్ ఆఫ్ ది సిరీస్ నాతవరానికి చెందిన కర్రి నాగరాజుకు రాగా రూ.మూడు వేల నగదు, షీల్డును పైల సూరిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ అధికారి పైల వెంకటరమణ, ఎస్ఆర్‌ఐలు శెట్టి సతీష్, పైల వెంకటరమణ, పారుపల్లి కిరణ్, ఫిజికల్ డెరెక్టర్ శెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖ్యఅతిథి

బాబు గెలుపు చారిత్రక అవసరం

- టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు



బాబు ష్యూరిటీ బాండ్‌లను ప్రదర్శిస్తున్న కోటేశ్వరరావు, పార్టీ శ్రేణులు

బుచ్చెయ్యపేట, జనవరి 16 : వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గెలుపు ఎంతైనా అవసరమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు అన్నారు. గొర్లెపాలెం, ఉప్పెరగూడెంలలో మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీసీ వర్గాలపై దాడులు అధికంగా ఉన్నాయని అంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంతోనే బీసీల రక్షణ సాధ్యపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కె.నాగేశ్వరరావు, గొలగాని రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి ఏపీటీఎఫ్ ఆర్థిక సాయం



సిబ్బందికి నగదును అందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

చీడికాడ, జనవరి 16 : సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మె చేస్తుండడంతో పాటు మూడు నెలలుగా వారికి వేతనాలు లేకపోవడంతో ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు బాసటగా నిలిచారు. ఇందులో భాగంగా ఐదుగురు సిబ్బందికి మంగళవారం రూ.75వేలను ఫెడరేషన్ తరపున పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పి.ఎ.నాయుడు, టి.వరహామూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాళ్ల వెంకటరమణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తూనిక కేంద్రాల నుంచి చెరకును సకాలంలో చేర్చాలి

రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్

కె.కోటపాడు, జనవరి 16 : తూనిక కేంద్రాల వద్ద పేరుకుపోతున్న చెరకును ఫ్యాక్టరీ సకాలంలో తరలించాలని ఎ.భీమవరానికి చెందిన రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ మొదలైనా చెరకును తరలించడంలా యాజమాన్యం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా కోరారు.

పాతకృష్ణాదేవిపేటలో ఘనంగా తీర్థ మహోత్సవం



తీర్థానికి హాజరైన భక్తజనం

కృష్ణాదేవిపేట, జనవరి 16 : పాత కృష్ణాదేవిపేటలో మంగళవారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తోడ పెద్దును గ్రామంలో ఊరేగించారు. సర్పంచ్ పందిరి సత్యానాయుడు, గ్రామ పెద్దలు, నిర్వహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'గోవాడ' రైతుల బకాయిల చెల్లింపు ప్రారంభం

చోడవరం, జనవరి 16 : గోవాడ ఫ్యాక్టరీకి గత సీజనల్‌లో చెరకును సరఫరా చేసిన రైతులకు బకాయిల చెల్లింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం చెరకు రైతుల బకాయిల చెల్లింపులకు గత ఏడాది సెప్టెంబరు నెలాఖరున రూ.12.3 కోట్లు మంజూరు చేయగా, మూడున్నర నెలల తరువాత మోక్షం కలిగి. దీంతో సదరు నగదు ఈనెల 13వ తేదీ రాత్రి ఫ్యాక్టరీ ఖాతాకు జమైన సంగతి తెలిసిందే. చెరకు రైతుల బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు కలిపి రూ.12.3కోట్లతో పాటు, ఫ్యాక్టరీకి రావలసిన విద్యుత్ బకాయిలు రూ.50 లక్షలు కలిపి మొత్తం రూ.12.8 కోట్లను షుగర్ ఫ్యాక్టరీ అకౌంట్‌కు శుక్రవారం అర్ధరాత్రి జమ అయినప్పటికీ, వరుసగా పండగ రోజులు కావడం, బ్యాంకులకు సెలవు కావడంతో బకాయిల చెల్లింపు వెంటనే చేపట్టలేదు. మంగళవారం బ్యాంకులు ప్రారంభం కావడంతో చెరకు రైతులకు బకాయిల చెల్లింపును ప్రారంభించారు. ఈ నిధులలో మంగళవారం ఫ్యాక్టరీ కార్మికులకు గత ఏడాది బకాయిపడిన సెప్టెంబరు, అక్టోబరు నెల వేతన బకాయిలు జమ చేశారు.

'డ్రైవర్లకు ఏకాగ్రత అవసరం'



సదస్సులో మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ సుధాకరరావు

నర్సీపట్నం, డిసెంబరు 16 : బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లకు ఏకాగ్రత చాలా ముఖ్యమని పట్టణ ఎస్ఐ సుధాకరరావు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఇక్కడ ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలను గమనించాలని, భద్రత నియమాలు పాటించాలని వివరించారు. డిపో మేనేజర్ ధీరజ్ మాట్లాడుతూ డ్రైవర్లు డ్యూటీ దిగన తర్వాత సాధ్యమైనంత ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరక్కుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా నగదు అందజేత



దేవరాపల్లి, జనవరి 16 : వెంకటరాజపురానికి చెందిన లెక్కల పెంటయ్య అకాల మరణంతో అతని భార్య ఉమాదేవికి రూ.లక్ష వైఎస్సార్ బీమా కింద మంజూరైన నగదు చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు సోమవారం తారువ క్యాంపు కార్యాలయంలో అందజేశారు.